# కొరిసపాడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుకు చర్యలు

**- జిల్లా కలెక్టర్ పి రాజబాబు**



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు రిజర్వాయర్ వద్ద పెండింగ్లో ఉన్న పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఆదివారం ఆయన ఈ రిజర్వాయర్ ను పరిశీలించారు. ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. అబూత్ అలీం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి ఈ సందర్భంగా రిజర్వాయరుకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు వివరించారు. స్థానికులతోనూ ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయరుకు తరలించేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎత్తిపోతల, పైప్ లైన్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు రిజర్వాయర్ వద్ద కట్ట నిర్మాణ పనులు కొంతమేరకు పూర్తి కావాల్సి ఉందన్నారు. వీటి గురించి ముఖ్యమంత్రి వద జరిగిన సమావేశంలోనూ ప్రస్తావన వచ్చిందన్నారు. మొదట విడతలో ప్రభుత్వం రూ.35 కోట్లను బడ్జెట్లో కేటాయించిందన్నారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఈ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో నష్టపరిహార, పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులను రెండు మూడు నెలల్లో పూర్తిచేసి, రిజర్వాయర్ కింద ఉన్న సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని ప్రకటించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆర్. రాజ్యలక్ష్మి, తహసిల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఒంగోలు గుంటూరు రోడ్డులోని ఏ1 ఫంక్షన్ హాల్లో పాతూరి పుల్లయ్య చౌదరి కుమారుని వివాహ వేడుకలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ రాజ్ విమల్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా తాలూకా పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఎస్ కన్వెన్షన్లో జరిగిన పసుపులేటి మురళీకృష్ణ కుమారుని వివాహ మహోత్సవంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మన ఊరి వికాసం ఆధ్వర్యంలో వైద్య సేవలు..

**కొండపి, ప్రభాతవార్త**



మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో మన ఊరి వికాసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత.వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా 35 మందికి ఉచిత వైద్య పరిక్షలు ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డా.కంకణాల కృష్ణ మోహన్ ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు. డా.కృష్ణ మోహన్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు అప్పుడప్పుడు షుగరు,బిపి పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ చేయించు కోవడం ముఖ్యమని అన్నారు.అందరూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలని అన్నారు. ధీర్ఘకాలిక రోగులు క్రమం తప్పకుండా పరిక్షలు చేయించు కుంటూ,మందులు వాడటం ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ రావెళ్ల రాజారావు దంపతులు గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తాన్, ఆరోగ్య శిబిరం భవన దాత గుంటుపల్లి పద్మావతి, గ్రామ ప్రజలు, మనఊరి ఆరోగ్య వికాసం కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

**కొండపి, ప్రభాతవార్త**





మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈసందర్భంగా ఏర్పాటు చేసి సభలో ఎంపీడీఓ బి. రామాంజినేయలు మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వారి ఆర్థిక బలవపేతానికి ఎన్నో కార్యక్రమాలను తీసుకొస్తున్నారని వెల్లడించారు. సామాజిక, ఆర్థిక, సాంస్క ృతిక, రాజకీయ సాధనలను గౌరవించడానికి, అలాగే సమానత్వం కోసం అవగాహన పెంచడానికి మహిళా దినోత్సవం రోజును పాటిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసీడియస్ సూపర్వైజర్, డాక్టర్లు మహిళలు అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.

## 20 మంది విశ్వబ్రాహ్మణ మహిళలకు ఘన సన్మానం

**జె. పంగులూరు మార్చి 8 ప్రభాతవార్త**



మహిళలు అన్ని రంగాలలో ఎదిగుతూ రాజ్యాలను దేశాలను పాలించే నాయకులుగా ఎదుగుతున్నారని జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారి అన్నారు. శ్రీ విశ్వకర్మ సేవా ట్రస్ట్, పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహిళ దినోత్స్నవ వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. మండలంలోని రేణింగవరం పోతులూరి వీర బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలో జిల్లా సంఘం ఆచారి, పంగులూరు మండల సంఘం అధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న 20 మంది విశ్వబ్రాహ్మణ మహిళలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారి మాట్లాడుతూ మహిళలు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు తక్కెళ్ళ పాటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళ పా టి నాగేంద్రప్రసాద్, కోశాధికారి ఆర్ శ్రీనివాసులు. ట్రస్టు ఉపాధ్యక్షుడు కొండముది ఆంజనేయులు సంఘ మాజీ అధ్యక్షులు కొల్లపూడి కామేశ్వరరావు. మురికిపూడి ఓంకార్ శర్మ మరియు మండలంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన అంద మహిళలు

**ఉలవపాడు, మార్చి 8, ప్రభాతవార్త**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉలవపాడు మండలం చాకిచెర్ల శ్రీశ్రీ నగర్ లో ప్రేమ జ్యోతి మినిస్ట్రీ సంఘం అందమహిళల ఆధ్వర్యంలో 20 మంది వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా పలువురు అందమైన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు తీసిపోని విధంగా అంద మహిళలు కూడా సమాజంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అందమహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిడుగు జ్యోతి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాపట్ల అన్నమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా గౌరీ, సహాయ కార్యదర్శి యేసు దయా, రాష్ట్ర ట్రెజరర్ ఎస్తేరు రాణి, 60 మంది అంద మహిళలు పాల్గొన్నారు.

# మహిళల భద్రత,ఆర్థిక సాధికారికతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- న- ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవం







**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

మహిళల భద్రతకు, వారి ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఒంగోలు నగరంలోని బృందావనం కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎంపీ.మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో నడిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలు సంక్షేమ పథకాలను కూడా ఈ దిశగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన మహిళలకు అత్యంత సురక్షితమైన నగరముగా విశాఖపట్నం నిలిచిందన్నారు. 14 ఏళ్లు పైబడిన బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేయించాలని మహిళలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ఆలంబనగా చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. రాజకీయంగానూ ముందడుగు వేసేలా చట్టసభల్లో 33 రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సాధికారత కోసం వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధి, సమాజ అభవృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళల ఆరోగ్యానికి భద్రతను ఇస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ కుటుంబంలో సమాజంలో స్త్రీ పాత్రను, నిర్వహిస్తున్న బాధ్యతలను కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వివిధ రంగాలలో విజయం సాధించిన మహిళలు ఈ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు. మంత్రి, ఇతర అతిధుల చేతుల మీదగా వీరు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వివిధ పథకాల కింద మెప్మా మహిళలకు రూ.18.60 కోట్లు, డిఆర్డిఏ మహిళలకు రూ.314.61 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.67.28 కోట్ల విలువైన బ్యాంకు చెక్కులను ఆర్థిక రుణం కోసం అందించారు. ఈ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ స్టాల్ను కలెక్టర్ ప్రారంభించి అర్హురాలైన బాలికకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేయించారు. మెప్మా, ఐసిడిఎస్, పోలీస్, డిఆర్డిఏ, ఏపీఎంఐపీ, బ్యాంకింగ్, పరిశ్రమలు, ఏపీఎస్ ఆర్టీసీ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఇతర అతిథులు వీక్షించారు. ఆయా శాఖల ద్వారా అందిస్తున్న పథకాల ప్రయోజనాలను అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. రాయితీ ద్వారా మంజూరైన ఒక ట్రాక్టర్, మూడు ఆటోలను ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి, కలెక్టర్, ఎంపీ అందించారు. ఈ వేడుకలలో డీఆర్వో బి.చిన ఓబులేసు,డిఆర్డిఏ పిడి నారాయణ, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీప్రసన్న, ఎస్.డీ.సి. కళావతి, ఎల్.డి.ఎం. రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ. అర్జున్ నాయక్, ఐసిడిఎస్ పి.డి. నాగమణి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మీ, డీఎస్ఓ పద్మశ్రీ, ఒంగోలు డి.ఎస్.పి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కవిత, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరల పెంపుతో వంటింట్లో మంట

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ఇక్కడ వంటింటిలో మంటలు రేపుతోంది. ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) దిగుమతిపై ప్రభావం పడడంతో గృహ వినియోగ సిలిండర్పై రూ.60, వాణిజ్య సిలిండర్పై రూ.115 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే పెంచిన ధరలు అమల్లోకి తెచ్చాయి. దీంతో సామాన్యులు, చిరు వ్యాపారులపై ఆర్థికంగా భారం పడింది.ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో మొత్తం 47 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా... వీటి పరిధిలో సుమారు ఎనిమిది లక్షల కనెక్షన్లు ఉన్నాయి. గృహాల్లో సగటున నెలకు ఒక్కో సిలిండర్ వినియోగిస్తున్నారు. ఆ లెక్కన వినియోగదారులపై మొత్తం రూ.4.80 కోట్ల మేర అదనపు భారం పడింది. దీపం2 పథకం కింద నాలుగు లక్షల మంది లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా మూడు సిలిండర్లు (నాలుగు నెలలకొకటి చొప్పున) ఉచితంగా అందజేస్తోంది. తాజా ధరల పెంపు ప్రభుత్వానికీ భారం కానుంది. ప్రస్తుతం ఒంగోలు నగరంలో గృహ వినియోగ సిలిండర్ (14.2 కిలోలు) ధర రూ.898 ఉండగా... ఇప్పుడు రూ.958కి చేరింది. వాణిజ్య సిలిండర్ ధర (19 కిలోలు) రూ.1982 కాగా... రూ.2,097కు పెరిగింది.రవాణా ఛార్జీల పేరిట గ్యాస్ డెలివరీ సిబ్బంది ప్రాంతాన్ని బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నిబంధనల ప్రకారం ఏజెన్సీకి అయిదు కిలోమీటర్ల పరిధిలో రవాణా ఛార్జీలు వసూలు చేయకూడదు. అంతకు దాటి 15 కి. మీ. వరకు రూ.20, ఆపై దూరంలో అయితే రూ.30 ఛార్జీలుగా నిర్ణయించారు. ఈ నిబంధనలేవీ సిబ్బంది, కొన్ని ఏజెన్సీలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇదో అదనపు భారంగా మారింది.




## 25 నుంచి పొగాకు కొనుగోళ్లు..

**- తొలిగా కందుకూరు1, పొదిలిలో ప్రారంభం**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రస్తుత సీజన్కు సంబంధించి ఆంధ్రాలో పొగాకు కొనుగోలు తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 25న కందుకూరు1, పొదిలి కేంద్రాల్లో; మిగతా చోట్ల ఏప్రిల్ 9 నుంచి వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో రైతు నాయకులు, వ్యాపారులు, వేలం కేంద్రాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.గత మూడేళ్లుగా మార్కెట్లో మంచి ధరలు లభించడంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు. అక్టోబరులో మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసి వాతావరణం అనుకూలించడం, శనగకు సరైన మార్కెట్ లేకపోవడమూ ఈ సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. ఓ వైపు ఆకు రెలుపులు సాగిస్తూనే మరోవైపు నాట్లు కొనసాగించారు. గతంతో పోలిస్తే పంట నాణ్యత బాగుంది, కానీ సిగిరెట్లపై విధించిన జీఎస్టీ, సుంకాల కారణంగా కర్ణాటక మార్కెట్లో సంక్షోభం నెలకొంది. ఆ ప్రభావం ఇక్కడ కొనుగోళ్లలో జాప్యానికి కారణమైంది. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధరలపై రైతుల్లో ఆందోళన నెలకొంది. 202526 సీజన్కు సంబంధించి ఎస్బీఎస్, ఎస్ఎల్ఎస్ రీజియన్ల పరిధిలోని వేలం కేంద్రాలకు 88.88 మీ.కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 147.30 మి.కిలోలు ఉత్పత్తి కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. అంటే అనుమతికి మించి 58.42 మి.కిలోలు అధికంగా ఉత్పత్తి వచ్చింది.

# మహిళా సాధికారితకు జగనన్న పెద్దపీట

- జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వెల్లడి
- ఘనంగా మహిళా దినోత్సవం







**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్రంలో మహిళా సాధికారితకు పెద్ద పీట వేసింది దివంగత సీఎం వైఎస్సార్, తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అని జడ్పీచైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళా దినోత్సవ వేడుకలను పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ అధ్యక్షత వహించారు. ముందుగా స్వర్గీయ వైఎస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, మాజీమంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్రెడ్డి ఇచ్చే పథకాలంటే ఎక్కువగా ఇస్తానని చంద్రబాబు మాటలు నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే వాటిని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. సూపర్సిక్స్, సూపర్ ఏయిట్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారంటూ విమర్శించారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం మినహా కొత్త కనిపిస్తున్న దాఖలాలు లేవని ఆమె పేర్కొన్నారు. మహిళల కోసం ప్రత్యేక పోలీసు స్టేషన్ను ఏర్పాటు చేసి దిశ యాప్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రక్షణ కల్పించారని ఆమె గుర్తు చేశారు. ఆ సమయంలో మహిళలు స్వేచ్ఛగా తిరిగేవారని, అయితే ప్రస్తుతం వీరికి రక్షణ కరువైందని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళా ప్రాధాన్యం పెరిగితే దేశం మరింత సమానత్వంతో ముందుకెళ్తుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు 50శాతం మేర అవకాశాన్ని మహిళలకు అప్పటి సీఎం జగన్మోహన్రెడ్డి కల్పించిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రతి పథకం వారికి చేరేలా రూపొందించారని వివరించారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్మోహన్రెడ్డికే దక్కుతుందని ఆయన కొనియాడారు. జగనన్నను మరోసారి సీఎంను చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తల్లికి వందనానికి సీఎం చంద్రబాబు కోత విధించారని ధ్వజమెత్తారు. జిల్లాలో మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ఎన్నో సంస్కరణలను జగన్మోహన్రెడ్డి అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి చంద్రబాబు మోసగించారని, మండిపడ్డారు. జీతాలు పెంచాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు రోడ్డెక్కితే వారిని నిర్ధాక్షణ్యంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. జిల్లా వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాలన స్వర్ణయుగమని అన్నారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో భరోసా కల్పించారని ఆమె పేర్కొన్నారు. తొలుత జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని మహిళలు నిర్వహించారు. అనంతరం కేక్ను కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన, ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.

# కోరం లేక మండల సమావేశం వాయిదా



**బల్లికురవ, మార్చి 8, ప్రభాతవార్త**
కోరం లేక ఆదివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు కుసుమకుమారి తెలియజేశారు. నిబంధనల ప్రకారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఆదివారం అయినప్పటికి సమావేశం ఏర్పాటు చేశామని, అయితే ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉప్పుమాగులూరు ఎంపీటీసీ ఒంటరి మరియమ్మలు మాత్రమే హాజరు కావడంతో సమావేశం వాయిదా పడింది. తిరిగి మరలా సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయాలలో మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించే పరిపాలనాపరమైన ఆనవాయితీ లేకపోవడంతో ఆదివారం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన రోజులలో సైతం అధికారుల ఒత్తిడితో అంతంతమాత్రంగానే సమావేశానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు ఆదివారం కనీసం సమాచారం అందుకునే స్థితిలో కూడా లేరు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**బల్లికురవ, మార్చి 8, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల యుటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యావంతులు భవనంలో నిర్వహించిన వేడుకలలో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. విభిన్న రంగాలలో మహిళలు సాధించిన సమాజిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ విజయాలను గౌరవిస్తూ వారిని ఘనంగా సన్మానించే శుభదినం. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీ లక్ష్మీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు బహుకరించి గౌరవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యూయార్క్ మహా నగరంలో మహిళా కార్మికుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల నుండి మహిళా దినోత్సవం ఉద్భవించింది అన్నారు. అప్పటి నుండి మహిళల సమానత్వం, హక్కులు, సాధికారితను, ప్రోత్సహిస్తూ ఈ పర్వదిన కొనసాగుతుందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో అంజనా దేవి మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగిగా, మహిళలు సమాజానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. 1911 నుండి జరుపుకుంటున్న మహిళా దినోత్సవం కారణంగానే మహిళలకు సమాజంలో సమాన గుర్తింపు, హక్కులు సమకూరాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమాలలో ఏవో పాండురంగారావు, సీనియర్ సహాయకులు కోటేశ్వరరావు, మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షులు ధూళిపాళ్ల శేషగిరి, పాలపర్తి రామాంజనేయులు, అచ్యుత మోహన్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా రామలింగేశ్వరస్వామి తిరుణాళ్ల మహోత్సవం



**బల్లికురవ, మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో వేంసి ఉన్న రామలింగేశ్వరస్వామి 31వ వార్షికోత్సవ తిరునాళ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం 6గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన తిరుణాల మహోత్సవం, 8.30గంటలకు ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పూజాధి కార్యక్రమాల అనంతరం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది. రాత్రి 9గంటలకు ప్రత్యేక విద్యుత్ ప్రభ ఏర్పాటు, కోలాట ప్రదర్శన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

# ముత్యాలమ్మ ఆలయానికి భూమి పూజ



**బల్లికురవ, మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో ప్రతిష్ఠాచార్యులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల నడుమ గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి దంపతులు, గ్రామప్రజలుఅధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులంతా సమిష్టి సహకారం చేస్తున్నారని అభివృద్ధి కమిటీ తెలియజేసింది.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**మార్టూరు, మార్చి 8, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణేశునివారిపాలెం గ్రామ వాస్తవ్యులు పిన్నింటి వీరయ్య భార్య వెంకటరత్నం ఆర్థిక సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్టూరులోని ముస్లిం కాలనీలో నివసిస్తున్న పేద కుటుంబం అయినటువంటి నూర్ బి అనే మహిళకు కుట్టు మిషన్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, రోటరీ మెంబర్స్ పాల్గొన్నారు.

# రామయ్య కుటుంబానికి కరణం పరామర్శ







**బల్లికురవ, మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని నక్క బొక్కలపాడు గ్రామానికి చెందిన దూళిపాళ్ల రామయ్య కుటుంబాన్ని చీరాల వైకాపా ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు పరామర్శించారు. రామయ్య భార్య కుసుమకుమారి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఆమె దశదిన కర్మ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కుసుమకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామయ్య కుమారులు తాతారావు, వీర నారాయణలను ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న చల్లగుండ్ల శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పార్టీ నేతలు ఒంగోలు సుబ్బయ్య, మాజీ సర్పంచ్ బండి పుల్లయ్య, షేక్ శ్రీను వలి, గోరంట్ల రవి, నిమ్మల రామకృష్ణ, కక్కెర బుజ్జిబాబు, నిమ్మల మురళి, దూళిపాళ్ల విజయందర్, షేక్ ఖాదర్ సాహెబ్, ఒంగోలు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## పెన్షనర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం



**కొనకనమిట్ల, మార్చి 8, ప్రభాతవార్త**
పొదిలి పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెన్షనర్ల యూనియన్ అధ్యక్షులు బాదుల్లా ప్రధాన కార్యదర్శి మదార్ వలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తహసీల్దార్లు చంద్రావతి, సువర్ణ మాట్లాడుతూ స్త్రీ లేనిది ప్రపంచం లేదని అలాంటి స్త్రీని ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మనోరమ, తేజోవతి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. పలువురు రిటైర్డ్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, దాసరి గురుస్వామి, మోహన్‌రావు తోడ్పాటు అందించారు. అనంతరం రిటైర్డ్ మహిళ తహసీల్దార్లు, ప్రధానోపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

## పోలేరమ్మ తల్లి నూతన ఆలయంకు శంకుస్థాపన



**లింగసముద్రం, మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పోలేరమ్మ తల్లి నూతన ఆలయం శంకుస్థాపనకు ముఖ్యఅతిథులుగా లింగసముద్రం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు వేముల గోపాలరావు టెంకాయకొట్టి పూజ నిర్వహించారు. అనంతరం వేముల గోపాలరావుని గ్రామ ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమంలో ఏపీ నెం.1

## - స్త్రీల ఆర్థిక అభ్యున్నతి సృష్టికర్త చంద్రబాబు

## - మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, మార్చి 8, ప్రభాతవార్త**
మహిళల సంక్షేమం, సాధికారతతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలపర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆదివారం చిన్నగంజాం జిల్లా పరిషత్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా ఏలూరి సాంబశివరావు హాజరై ప్రసంగించారు. మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. స్త్రీ లేకుండా సృష్టి లేదని, కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక మహిళ సాధికారత పొందితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం ముందుకు సాగుతుందని వివరించారు. మహిళల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుంచోప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డ్వాక్రా మహిళల రుణ పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రూ.5లక్షల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఇప్పటికే 3 లక్షల ఇళ్లు అందించామని, రాబోయే ఉగాది నాటికి మరో లక్ష గృహ ప్రవేశాలు జరగనున్నాయని తెలిపారు. మహిళల స్వయం ఉపాధి కోసం లక్ష కుట్టు మిషన్ల పంపిణీకి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కుప్పంలో విద్యార్థినులకు 5,555 సైకిళ్ల పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించినట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్ల, డ్రైన్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామని, రెండు నుంచి మూడు నెలల్లో 80 శాతం పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలు కనులు పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నేతలను ఎమ్మెల్యే ఏలూరి ఘనంగా సన్మానించారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రూ.150 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ చెక్కును అందజేశారు. పోషకాహారం వాటి ప్రాధాన్యత గురించి ఐసీపీఎస్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి ఆసక్తికరంగా తిలకించారు. డీఆర్‌డీఏ సహకారంతో కార్లు, టెంట్ సామాగ్రి, డీజే మైక్ సెట్టింగ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు పోద వీరయ్య, నాయుడు హనుమంతరావు, బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, అధికార ప్రతినిధి ఆజాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి లవన్న, ఐసీడీఎస్ సీడీపీవోలు సులోచన, సుభద్ర, ఏపీఎం అనురాధ, సుబ్బారావు, రామకృష్ణ, మోహన్‌రావు, పీపీసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాల ప్రభుత్వ హైస్కూల్లో అపరిశుభ్రంగా ఉన్న సౌకర్యాలపై గూడూరి ఎరిక్షన్‌బాబు ఆగ్రహం

### - ఉరుకులు పరుగులతో ఆర్వో ప్లాంట్ హైస్కూల్ ప్రాంగణం పరిశుభ్రం చేసిన హైస్కూల్ యాజమాన్యం







**పెద్దదోర్నాల, మార్చి 8, ప్రభాతవార్త**
దెబ్బకుదెయ్యం పారిపోయినట్లు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆకస్మికంగా ఒక తనిఖీ నిర్వహించగానే పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న వాతావరణం పరిశుభ్రంగా మారిపోయింది. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావుతో కలిసి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వీరి తనిఖీల్లో విద్యార్థులు తాగే ఆర్వో వాటర్ ప్లాంట్, వంటగది, పరిసరాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. దీంతో గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం తనకు ముఖ్యం. పాఠశాలలో వసతుల విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోనని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రమైన తాగునీరు, శుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని పాఠశాలలో అన్ని వసతులను శుభ్రపరిచి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలని అధికారులను హెచ్చరించారు. దీంతో స్పందించిన అధికారులు ఉరుకులు, పరుగులతో ఆదివారం ఆర్వో వాటర్ ప్లాంట్, వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. వంటగదిలోని అట్టలను తొలగించారు. పరిసరాలలో ఉన్న చెత్తాచెదారం, బూజు తొలగించారు. ప్రధానోపాధ్యాయురాలు పి.శ్యామ్ ప్రసన్నతాంజలి సహకారంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం అనసూయదేవి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి పాఠశాల వాతావరణాన్ని కల్పించారు.

# మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి

## - ఎంపీపీ గాయం సావిత్రి





**హనుమంతునిపాడు, మార్చి 8, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొని మాట్లాడుతూ ప్రతి మహిళ వంట గదికి పరిమితం కాకుండా భాగా చదువుకుని సొంత కాళ్ల మీద నిలబడి, అన్ని రంగాల్లో మగవారితో సమానంగా ముందు ఉండాలని హితవు పలికారు. మహిళలు కుటుంబంలో తల్లిగా భార్యగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే సమాజంలో వ్యాపార సామాజిక రాజకీయ క్రీడా, కళా రంగాల్లో తమ సత్తాను చాటుతున్నారు. అందుకు చాలా గర్వకారణంగా ఉందని తెలియజేశారు. అతి ముఖ్యమైన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరగా అమలు పరచాలని కోరారు. బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు మద్దతు తెలిపినటువంటి అప్పటి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు స్థానిక సంస్థల్లోనూ నామినేటెడ్ పదవులలోనూ మహిళలకు ఎన్నో అవకాశాలు కల్పించారని అంతే కాకుండా సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా మహిళలకే అందజేసినటువంటి ఘనత మన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలియజేశారు. అదే విధంగా కార్యకర్తలు అందరూ కష్టపడి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఆమె కోరారు. ముందుగా ఆమె మహిళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, హనుమంతునిపాడు మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబీ, వివిధ నియోజకవర్గాల మహిళ అధ్యక్షులు వైఎస్సార్‌సీపీ పార్టీ వివిధ సంఘాల ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అవకాశాలు ఇచ్చి కుటుంబం, సమాజం బలపడేటట్లు చేసింది జగన్‌మోహన్‌రెడ్డే

### - ఎమ్మెల్యే చంద్రశేఖర్



**యర్రగొండపాలెం, మార్చి 8, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను శక్తి వంతం చేస్తేనే సమాజం, కుటుంబం బలపడుతుందని , దేశ ప్రగతికి మహిళల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారిత, స్వయం ఉపాధి, సామాజిక భద్రత కోసం నాటి వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాడని తెలిపారు. ఉచితంగా ఎన్నో పథకాలను మహిళల పేరుతో అందించి మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచిన విషయం గుర్తు చేశారు. నాడు ప్రతి సంక్షేమ పథకం మహిళ పేరుతో మహిళల ఖాతాలో బటన్ ద్వారా వేలకు వేలు డబ్బులను వేసిన విషయం తెలిపారు. గత ఐదేళ్ళు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లక్షకు తగ్గకుండగా మహిళ ఖాతాల్లో డబ్బులు ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళ ఖాతాలు జీరో అకౌంట్‌కు పడిపోయాయని తెలిపారు. లక్షల మంది మహిళలకు జగనన్న కాలనీలలో ఇంటి పట్టాలు ఇచ్చి గౌరవించారని, డ్వాక్రా మహిళలకు చేయూత, సున్నావడ్డీతో పాటు బ్యాంకు రుణాలు, మహిళా వ్యాపార ప్రోత్సాహం వరకు పలు కార్యక్రమాల ద్వారా మహిళల జీవితాల్లో జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన మార్పు తీసుకొచ్చారని ఎమ్మెల్యే చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యర్రగొండపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్ళు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, మార్చి 8, ప్రభాత వార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వరశర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, గోత్రనామాలుపూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్ల సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలుజిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్ల పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదాన సత్రంలోఅన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవోనర్రా నారాయణరెడ్డి, ఆర్ఏకాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు.

## ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో మహిళా దినోత్సవ వేడుకలు



**మార్కాపురం, మార్చి 8,ప్రభాతవార్త**
ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కాపురం ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి ఏపీ జేఏసీ మహిళా విభాగం స్టేట్ అసోసియేట్ ఛైర్ పర్సన్ సైకం శివకుమారి రెడ్డి మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీలో అమలవుతున్న స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి జనార్ధనరావు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళలకు నెలసరి సమయంలో మూడు రోజుల ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం పీటీడీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ మహిళా దినోత్సవాన్ని ప్రత్యేక సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న 180 రోజుల చైల్డ్ కేర్ లీవును కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అనుసరించి రెండు సంవత్సరాలకు పెంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ బాషా హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కంభం వెంకట రమణ, రాష్ట్ర మెంటెనెన్స్ కమిటీ సభ్యుడు కొండలరావు, జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మంగమ్మ, అమరావతి జేఏసీ మహిళా విభాగం మార్కాపురం డివిజన్ ఛైర్‌పర్సన్ డి.లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.వి.భాషా, డిపో నాయకులు వెంకటేశ్వర్లు, నాని, డి.ఎం.నాయక్, శేక్షవలి తదితరులతో పాటు మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోల మహిళాఉద్యోగులు మరియు నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నాలుగుడిపోల మహిళా ఉద్యోగులు, నాయకులు పాల్గొని విజయవంతం చేశారు.

## మహిళ సాధికారిత తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యం



**యర్రగొండపాలెం, మార్చి 8, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను యర్రగొండపాలెంలో వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు అంగన్‌వాడీ మహిళలతో కలిసి అధికారులు ఘనంగా సన్మానించారు. యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో పాల్గొన్న మహిళలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యుతలు ఎరిక్షన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ మహిళ అభివృద్ధికి కట్టుబడి ఉందని, డ్వాక్రా అంగన్‌వాడీ మహిళ అభివృద్ధికి కట్టుబడి ఉందని, డ్వాక్రా, అంగన్‌వాడీ మహిళ వ్యవస్థకు పునాది తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. ప్రతి మహిళా పారిశ్రామిక వేత్త కావాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్షకు లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దిందని తెలిపారు. మహిళలను గౌరవించుకునేందుకు ప్రభుత్వంలో ఉచిత బస్సు ప్రయాణం నుంచి బ్యాంకు రుణాలు, మహిళా వ్యాపార ప్రోత్సాహం వరకు పలు కార్యక్రమాల ద్వారా మహిళల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుజాతలతో పాటు పార్టీ మండల అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, బీజేపీ మండల అధ్యక్షులు మాదాల సూర్యనారాయణ, డ్వాక్రా సంఘాల కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## వాసవి స్కూల్‌లో ... ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**మార్కాపురం టౌన్, మార్చి 8, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని వాసవి స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. రంగయ్య మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక విజయాలను వేడుకగా చేసుకునే రోజు మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం 20వ శతాబ్దం ప్రారంభంలో ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల నుండి ఉద్భవించి, ఐక్యరాజ్యసమితిచే గుర్తించబడిందన్నారు. నేటి కాలంలో మహిళలు విద్య, ఉద్యోగం, నాయకత్వం వంటి అనేక రంగాలలో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధికి విశేషంగా దోహదపడుతున్నారన్నారు. ఏఓ కె.రంజిత్ మాట్లాడుతూ సంస్థలలో గౌరవ వృత్తి చేస్తున్న వారందరూ మా ఇంటి ఆడబిడ్డలు, సోదరీమణులుగా భావిస్తానన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళల సాధికారతకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులను గౌరవంగా సత్కరించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం ప్రకాశం జిల్లా కార్యదర్శిగా యక్కలి కమల్ గుప్త నియామకం



**మార్కాపురం టౌన్, మార్చి 8, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణానికి చెందిన యువ నాయకుడు యక్కలి కమల్ గుప్త ను భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) ప్రకాశం జిల్లా కార్యదర్శిగా పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. పార్టీ పట్ల నిబద్ధతతో, యువత సమస్యలపై చురుకుగా పని చేస్తున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడంతో మార్కాపురం ప్రాంతంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యక్కలి కమల్ గుప్త మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా యువతను సంఘటితం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం పని చేస్తానని అన్నారు. ఈ నియామకంపై స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్న పోలా నాగభూషణ్ రెడ్డి



**గిద్దలూరు, మార్చి 8, ప్రభాతవార్త**
మార్కాపురంలో శాంతి వనం, పిజిఎన్‌ఎఫ్ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కార్యక్రమంలో గిద్దలూరు ఎంఈఓ 2 పోలా నాగ భూషణంరెడ్డి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సహోపాధ్యాయులు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## మార్కాపురం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**మార్కాపురం, మార్చి 8,ప్రభాతవార్త**
మార్కాపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసుకొని ఈ కార్యక్రమంలో అధికారులకు అందజేయాలని ఆయన కోరారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హాజరై ప్రజల వినతులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

7_7.qxd 3/8/2026 11:59 PM Page 1



## మహిళల సాధికారతకు విద్యే బలమైన ఆయుధం : డా సోని

### - జార్జ్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**మార్కాపురం, మార్చి 8,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని జార్జ్‌ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తర్లుపాడు మండలంలోని ఎంపిహెచ్‌సి తర్లుపాడు వైద్యాధికారి డా వి.సోని హాజరయ్యారు. ఈ సందర్భంగా డా సోని మాట్లాడుతూ మహిళలు విద్య, వైద్యం, పరిశోధన వంటి అన్ని రంగాలలో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టుకోవడంతోపాటు లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. కళాశాల అకాడెమిక్ అడ్వైజర్ డా స్టెల్లా సతీష్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్యే బలమైన ఆయుధమని తెలిపారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని కృషి చేస్తే భవిష్యత్తులో మంచి స్థానాలను సాధించగలరని చెప్పారు.డీన్ ఆఫ్ అకాడెమిక్స్ డా వై సునీత మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో ప్రతిభ చాటుతున్నారని, విద్యార్థినులు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు నిర్వహించిన రంగోలీ పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా ఆర్ అనూష, మహిళా సిబ్బంది మరియు సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధితోనే సమాజ పురోగతి

### - మహిళా దినోత్సవం మాకు సెంటిమెంట్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం, మార్చి 8 ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి,జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొని మహిళా సాధికారతపై ప్రసంగించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ,మహిళలు విద్య,ఉద్యోగం, వ్యాపారం వంటి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా, మార్కాపురం పట్టణం మరియు పరిసర ప్రాంత మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం తమకు ప్రత్యేకమైన సెంటిమెంట్ అని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మార్కాపురంలో నిర్వహించిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని కేంద్రంగా జిల్లా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని, చెప్పినట్లుగానే ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలంలోనే మార్కాపురం జిల్లాను ప్రకటించిందని తెలిపారు. ఇటీవల మార్కాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మూడు నెలల్లోనే సాగునీరు అందిస్తామని చెప్పారని తెలిపారు. ఒక నెల ఆలస్యమైనా కొద్ది నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తారని ప్రజలకు విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ, పోలీస్‌శాఖలకు చెందిన మహిళా సిబ్బంది ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి ఆరోగ్యం, పోషణ, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. మహిళలు పాల్గొన్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అధికారులు,ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనగా మహిళల ఉత్సాహభరిత వాతావరణంలో మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

### మహిళా దినోత్సవ వేడుకల్లో శ్రీ సాయిబాలాజీ విద్యార్థినులకు సన్మానం

**మార్కాపురం, మార్చి 8 ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని శ్రీ సాయిబాలాజీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు డి భువన, మంజులత జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక సన్మానం పొందారు. మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా వీరిని సత్కరించారు. జిల్లాలో ఇప్పటివరకు ఏ పాఠశాలకు లభించని ఈ గుర్తింపు తమ పాఠశాలకు గర్వకారణమని డైరెక్టర్ పి ప్రకాశరావు, ప్రిన్సిపల్ మస్తాన్ వలి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల కృషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**మార్కాపురం మార్చి 8,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని జార్జ్ ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ కె డేనియల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె సురేష్ కుమార్, గర్ల్స్ అసిస్టెంట్ వార్డెన్ శిరీష, విద్యార్థులతో కలిసి కళాశాల ఫౌండర్ ఛైర్మన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ కె డేనియల్ మాట్లాడుతూ కళాశాల ఛైర్పర్సన్ శ్రీమతి చెరుకూరి తెరేసమ్మ ఒక ఉపాధ్యాయురాలిగా ఎంతోమందిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి అనేక మంది మహిళలను ఇంజనీర్లుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మహిళా శక్తి, మహిళా స్ఫూర్తిని చాటిచెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### - మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, మార్చి 8 ప్రభాతవార్త**

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైనదని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోనీ చీతిరాల కళ్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ముఖ్యమైన శక్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, వ్యాపారం, రాజకీయాలు వంటి అన్ని రంగాలలో మహిళలు ముందుకు రావడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. మన దేశంలో వివాహ బంధానికి ఉన్న విలువ ప్రపంచంలో ఎక్కడ లేదని, అభివృద్ధి చెందిన దేశాలలో ఎక్కడ ఒక్క మహిళ అధ్యక్షులుగా లేరని ఒక్క మన భారత దేశంలో తప్ప ఒకప్పుడు మహిళ అంటే వంట ఇంటికే పరిమితం అన్నారు. కానీ నేడు అలా లేదు మన రాష్ట్రంలో స్వేచ్ఛ, సమానత్వం స్వర్గీయ నందమూరి తారక రామారావు సమానత్వాన్ని ఇచ్చారని, 1983వ సంవత్సరంలో మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన వ్యక్తి స్వర్గీయ ఎన్‌టిఆర్ అని ఆదిలోనే కాదు సమాజంలో అన్ని రంగాల్లో ముందు ఉండాలని డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా సభ్యురాలు అభివృద్ధికి ఈ సంపాదన కుటుంబంలో వారికి ప్రత్యేక గుర్తింపు గౌరవం కలిగించిందని మన ముఖ్య మంత్రి మన చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు, గ్రూపులు ఏర్పాటు చేసి మహిళలు ఇంకా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. అనంతరం నియోజకవర్గం స్థాయిలో పేరు గౌరవం తెచ్చిన మహిళలు అయిన రచనలో, కవితలో జాతీయ స్థాయిలో పేరు గౌరవం తెచ్చిన రైల్వే ఉద్యోగి షేక్, షకీలా, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ బోనేని రవణమ్మ, మార్క్ అసెంబ్లీలో మాట్లాడిన నక్కా రమ్యా, అవయవ లోపం ఉన్నత స్థాయికి ఎదగడానికి అడ్డుకాదు అని నిరూపించి తన రెండు కళ్ళు కనిపించకపోయినా గ్రేడ్ 2లో ఉద్యోగం సాధించి నేడు అర్ధవీడు ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న సుజాతను ఎమ్మెల్యే ప్రత్యేకంగా శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు.

## విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి



**రాచర్ల, మార్చి 8 ప్రభాతవార్త**

విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన బచిగారి రాజశేఖర్ (22) అను యువకుడు మొక్కజొన్న పొలం వద్ద పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు తెలిసింది.

## పడకేసిన పారిశుధ్యం

### - పట్టించుకోని మండల స్థాయి అధికారులు



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**

మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో మురికి కాలువలలోఎక్కడ చెత్త అక్కడే పేరుకు పోయింది. మురికి కాలువలో చెడు నీరు ఆగిపోయింది. పట్టించుకున్న నాధుడే లేడు. పట్టించుకోవాల్సిన మండల స్థాయి అధికారులు తూతూ మంత్రంగా గ్రామాలకు వెళ్లి అంతా భాగానేఉందని ప్రభుత్వానికి చెప్పు కుంటున్నారు. కానీ కింది స్థాయిలో చూస్తే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. సైడు కాలువలు బూడిపోయి దోమలు వచ్చి ప్రజలకి అసౌకర్యాలు కల్పిస్తూ జబ్బులు భారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోల సైతం మరియు పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కరువైంది. అంతే కాక మండల స్థాయి అధికారులు ఎంపీడీవో సైతం గ్రామానికి వచ్చి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని వెళ్తున్నారు గాని ప్రజలకు సంబంధించిన ఇలాంటి విషయాలు పట్టించుకోకపోవడంపై పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సైడు కాలువల్లో పేరుకుపోయిన మట్టిని పంచాయతీ అధికారులు శుభ్రం చేయాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

## నాగరపమ్మ తల్లి కొలుపుల్లో దద్దాల నారాయణ యాదవ్

### - ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు



**కనిగిరి, మార్చి 8, ప్రభాతవార్త**

కనిగిరి మండలం బడుగులేరు గ్రామంలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ నాగరప్పమ్మ తల్లి కొలుపుల్లో ఆదివారం కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ నాగరపమ్మ తల్లి కృపతో ప్రజలందరికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, రైతులు పంటలు భాగా పండాలని, ప్రతి ఇంటా ఐశ్వర్యం నిండాలని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామ దేవతల పూజలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, ప్రజల ఐక్యతకు సంకేతమని అన్నారు. ఈ కార్యక్రమండలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, పాపనబోయిన కోటమ్మ, పాపనబోయిన నాగరాజు, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సేకం ఏడుకొండలురెడ్డి, మోర రామిరెడ్డి, బొబ్బూరి పోలయ్య, చింతలపూడి ప్రభుదాసురెడ్డి, మేకల వెంకటేశ్వర్లు, కుమ్మరికుంట రవి, పోతిరెడ్డి రమణారెడ్డి, తేలూరి అంకిరెడ్డి, బత్తుల బాల గురవయ్య, బత్తుల పెద్ద చెంచయ్య, కాసుల బాలయ్య, పొంకం పెద్దయోగి, చీమలదిన్నె శివ, కాసుల వెలుగొండ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూలు బాలికలు బహుమతులు




**కందుకూరు మార్చి 8, ప్రభాతవార్త**

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో చుండి మోడల్‌స్కూలు బాలికలు విజేతలయ్యారు. దీంతో ఆదివారం కందుకూరు డీఎస్పీ సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం విజేతలైన బాలికలు ప్రశంసా పత్రాలు బహుమతులు అందచేశారు. మార్చి 8 అంతర్జాతీయ దినోత్సవంలో బాగంగా మండలంలోని పలు విద్యాలయాల్లోని బాలికలకు ఇటీవల వ్యాసరచనపోటీలు నిర్వహించారు. ఈ నేపద్యంలో వీరికి బహుమతులు అందచేయడం జరిగింది. సదరు విద్యార్థినిలతోపాటు ప్రిన్సిపల్ వెంకటేశ్వరన్‌ను డీఎస్పీతోపాటు పలువురు అభినందించారు.

## ఘనంగా బొల్లికొండరాయ స్వామి తిరునాళ్ల





**కురిచేడు, మార్చి 8, ప్రభాతవార్త**

మండలంలోని ఆవులమంద, కల్లూరు, నాయుడుపాలెం పొలిమేర్లలో కొండపై వేంచేసి ఉన్న శ్రీబొల్లికొండరాయ స్వామి తిరునాళ్ల ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారికి అర్చక స్వాములు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులు వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొండపైకి ఘాట్‌రోడ్డు సౌకర్యం ఉండడంతో భక్తులు తాకిడి మరింత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి ఏడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి వాటి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రభలలో ఐదు టీడీపీకి చెందినవి కాగా,ఒకటి జనసేన, మరొకటి వైసీపీకి చెందినవి. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కురిచేడు ఎస్సై ఎం.శివ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును నిర్వహించారు.

## అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళామణులు



**కురిచేడు, మార్చి 8, ప్రభాతవార్త**

పురుషులకు ఏ మాత్రం తీసిపోకుండా అన్ని రంగాలలో స్త్రీలు ముందుకు వెళ్తున్నట్లు ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు స్వాతి అన్నారు. స్థానిక ఉర్దూ ప్రాధమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక మండల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారంనాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఆ సంఘ నాయకులు మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలా నాయక్, షేక్ ఖాజారహమతుల్లా, సీహెచ్ శివరామకృష్ణ, కే.మణితేజ, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రమశిక్షణతో భాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### - షైనింగ్ స్టార్స్ ఎలైట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రాధాదేవి వెల్లడి



**సంతనూతలపాడు, మార్చి 8, ప్రభాతవార్త**

విద్యార్థినీ, విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతి ఒక్కరూ భాగా చదివి ముందంజలో నిలవాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఎన్.రాధాదేవి కోరారు. సంతనూతలపాడులోని షైనింగ్ స్టార్స్ ఎలైట్ స్కూల్ ఐదవ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి షైనింగ్ స్టార్స్ ఎలైట్ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీహెచ్ అనిత అధ్యక్షత వహించారు. విద్యార్థులు విద్యతో పాటు ఆటలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని డాక్టర్ రాధాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు క్లాసులలో మెరిట్ విద్యార్థులు, పలు పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా డాక్టర్ రాధాదేవి పాఠశాల సెక్రటరీ సీహెచ్ అనిత,పాఠశాల ప్రిన్సిపాల్ అంబటి శ్రీనివాసరావు తదితరులు బహుమతులను అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక క్యాక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులచే భరతనాట్యం, కోలాటం, డ్యాన్సులు ఈ సందర్భంగా ప్రదర్శించారు.




## విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం

### - టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**సింగరాయకొండ, మార్చి 8, ప్రభాతవార్త**

విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడం లక్ష్యమని అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పల్లికొండ రవికుమార్ తెలిపారు. స్థానిక మల్లెతోట నాల్గవ లైన్‌లోని ఒక ప్రార్థన మందిరం ఆవరణలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన చెప్పారు. నేటి బాలికలే రేపటి మహిళలు" అని పేర్కొంటూ బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న పదిమంది విద్యార్థులకు పరీక్ష అట్ట, మ్యాథమెటికల్ బాక్స్,లాంగ్ స్కేల్, పెన్సిల్, పెన్ తదితర పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక దైవ సేవకులు సాల్మన్ రాజు, శ్రీనివాస్ నాయక్, జేమ్స్, మాధవ, ఆదిలక్ష్మి, రాజారం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**సింగరాయకొండ, మార్చి 8,ప్రభాతవార్త**

మండలంలోని సోమరాజుపల్లి గ్రామం ఫకీర్ పాలెం కి చెందిన కరిమున్నీసకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.37,378 చెక్కును రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అందజేశారు. ఆదివారం టంగుటూరు మండలం నాయుడుపాలెం లోని మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో చెక్కును లబ్ధిదారునికి అందించారు. ఈ సందర్భంగా మంత్రిస్వామి మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సోమరాజుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు శీలం సుబ్రహ్మణ్యం, బాలకోటేశ్వరరావు, గ్రామ నాయకుడు ఎస్కే ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ ఎయిడెడ్ ఉపాధ్యాయులను

## నిధి పోర్టల్లో నమోదు చేయాలి - ఏపీ టీచర్స్ గిల్ట్



**సింగరాయకొండ, మార్చి 8,ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్చి నెల నుంచి పదవీ విరమణ పొందనున్న ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను నిధి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ (APTG) జిల్లా అధ్యక్షులు కె.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటన లో కోరారు. మండల విద్యాశాఖ అధికారులు తమ కార్యాలయాల్లోని ఎంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా ఎయిడెడ్ ఉపాధ్యాయుల సేవా, కుటుంబ వివరాలకు సంబంధించిన అన్ని ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జీవో నం.10, తేదీ 14022026 ప్రకారం మార్చి నెల నుంచి పదవీ విరమణ పొందే ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను డ్రాయింగ్ అధికారుల ద్వారా అమరావతి ఏజీ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## కందుకూరులో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

### - మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట - ఎమ్మెల్యే






**కందుకూరు మార్చి 8 ప్రభాతవార్త**

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దవీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కందుకూరు బాలికల ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్, డిఆర్‌డీఏ,మెప్మా శాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ,ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ కమిషనర్ అనూష,సూపరింటెండెంట్ డా॥ ఇంద్రాణి తదితరులు కెక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదగెందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసిన డ్వాక్రా గ్రూపుల వ్యవస్థ మహిళాసాధికారిత వైపు పయనింపచేస్తుందన్నారు. మహిళాబివృద్ధి సంక్షేమానికి అమలవుతున్న తల్లికి వందనం, స్త్రీ శక్తి ,ఉచిత గ్యాస్ సిలిండర్లు..ఎన్టీఆర్ విద్యాలక్ష్మి,ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి తదితర పథకాలను వివరించారు. కందుకూరు నియోజకవర్గం పారిశ్రామిక కేంద్రంగా మారబోతోందన్నారు. తద్వారా వేల సంఖ్యలో యువతకు ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. ఇందులో యువతులు,మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. త్వరలో వివోఏలకు సెల్ ఫోన్లు, ఏపీఎంలకు ల్యాప్ టాప్‌లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ దేశంలోని ఐఏఎస్‌లలో 40 శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు పనితీరుకు దేశంలోనే గుర్తింపు ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని, మహిళలు మరింత బలమైన శక్తిగాఎదగాలని సబ్ కలెక్టర్ ఆకాంక్షించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 1683 పొదుపు గ్రూపులకు రూ.238 కోట్ల రుణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళా మణులను ఘనంగా సత్కరించారు. మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మోనిక, మెప్మా సీఎంఎం ఫణికుమారి,మెడికల్ ఆఫీసర్ బ్యూలా గ్రేస్, సమైక్య అధ్యక్షురాలు, ఏపిఎంలు,వివోఏలు, ఆర్పీలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా ఆఫీసులో మహిళా దినోత్సవ వేడుకలు



**కందుకూరు మార్చి 8, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగాసౌజన్య మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొవాలన్నారు,తద్వారా ప్రతి మహిళ ఉజ్వల భవిష్యత్‌ను ఆమె ఆకాంక్షించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గారికి గెలుపులో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో కూడా నాగేశ్వరరావు గెలుపుకు కృషి చేయాలని కోరారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామామల్లేశ్వరరావు మాట్లాడుతూ మహిళాభివృద్ధకి చేస్తున్న కృషిని వివరించారు. చట్టసభలతోపాటు అన్ని రంగాలలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మిరాజ్యం, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడ మౌనిక, ఘట్టమనేని అఖిల,ముళ్ళపాటి బుజ్జమ్మ, బత్తిన ఆదెమ్మ, అత్తంటి శ్రీలక్ష్మితోపాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో వేడుకలు



**కందుకూరు మార్చి 8, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని లెనిన్‌నగర్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. జిల్లా గౌరవ అధ్యక్షులు సుదర్శి రావమ్మ అధ్యక్షతవహించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జెండాను పాకల జయమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుదర్శి స్రవంతి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు రావులకొల్లు లక్ష్మి, సిపిఐ కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి బి సురేష్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే మురళి, వై ఆనందమోహన్, సిపిఐ నాయకులు ఉప్పుటూరు మాధవరావు, కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు వలేటి కల్పన, మెండా శైలజ, బెల్లంకొండ జ్యోతి, లింగా బత్తిన మాధురి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### బాలికల పాఠశాలలో ...

కందుకూరు బాలికల హైస్కూల్లో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలోల జరుగుమల్లి ఎంఈవో నాగేంద్రవదన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా ఉద్యమాన్ని వివరించారు. 200 సంవత్సరాల పోరాటచరిత్రలో మహిళలు పలు హక్కులు సాధించుకున్నారన్నారు. వీటిని నిలబెట్టుకోవాలన్నా హక్కులు, ఆత్మగౌరవం సాధించుకోవాలన్నా సంఘటిత శక్తి చైతన్యం ద్వారానే సాధ్యమన్నారు. చిర్యూరుపాడు హెచ్‌ఎం ద్రోణాదుల అనురాధ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే,రమాబాయి అంబేద్కర్ ఫాతిమా షేక్ లాంటి వారి కృషి ద్వారా నేడు మహిళలు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఆయుర్వేద డాక్టర్ పద్మజ,కావలి ఎంఈఓ బండి గోవింద్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద బ్రహ్మయ్య,స్దానిక హెచ్‌ఎం ద్వారకా రాణి, లెక్చరర్ సుజాత,లాయర్ పణికుమారి,కవిహిందీపండిట్ రోజ్ లీలా,బృందావనం మహిళా సంఘం కార్యదర్శి సుచరిత అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, రమణయ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 3/9/2026 12:01 AM Page 1



## మహాశివరాత్రి సందర్భంగా వైద్య శిబిరం ప్రశంసనీయం



**మార్కాపురం, మార్చి 8,ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి నడకదారిలో వెళ్లే భక్తుల కోసం డాక్టర్ ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శంకర విజయేంద్ర సరస్వతి అభినందించారు. భక్తులకు సేవ చేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన లీ ఫార్మా, నాట్కో ఫార్మా సంస్థలను కూడా ఆయన ప్రశంసించారు. వైద్య శిబిరంలో భక్తులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులు, మిల్లెట్స్ ఆధారిత ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సేవలను స్వామివారు కొనియాడారు.

## నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన వివరాలు



**అద్దంకి , మార్చి 8, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటిరవికుమార్ సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30గంటలకు అద్దంకి మండలంలోని బొమ్మనంపాడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోను, 10.30 గంటలకు శంఖవరప్పాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను,11.30 గంటలకు ధర్మవరంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థినీ,విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు పంపిణీచేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని ఆయన కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

### ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**చీరాల, మార్చి 8, ప్రభాతవార్త**
చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రౌండ్ నందు సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ 6 గురు మహిళా సభ్యులను ఘనంగా సత్కరించారు. పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు సామాజిక,ఆర్థిక, రాజకీయ విజయాలను స్మరించుకోవడమే కాకుండా మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు.తల్లిని పూజించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు, మహిళలను గౌరవించాలన్నా మహిళలు నేడు ఇంటి బాధ్యతల నుండి అంతరిక్షం వరకు దూసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురు ప్రసాద్, కాటమరాజు, తుకారాం, నిత్యానంద లాల్, దరియా సాహెబ్, సుభాషిణి, స్మృతి, నళినీ, లలితకుమారి, బదరీ నారాయణ, వీరాంజనేయులు, పూర్ణా, రవి, వాకింగ్ సభ్యులు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### జగన్ పార్టీకి జలక్... ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణ రెడ్డి బీజేపీలో చేరిక



**కనిగిరి, మార్చి 8, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గ రాజకీయాల్లో సంచలనం చోటు చేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విదేశాల్లో కీలకంగా పని చేసిన ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణ రెడ్డి పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఆవిర్భావం నాటి నుండి వైసీపీకి అండగా నిలిచిన ఆయన దశాబ్ద కాలం అనుబంధాన్ని తెంచుకోవడం, ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుండి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతాలకు ఆకర్షితుడైన సూర్యనారాయణరెడ్డి ఆస్ట్రేలియాలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎన్ఆర్ఐ విభాగం కన్వీనర్‌గా వ్యవహరిస్తూ విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారిని పార్టీ వైపు తిప్పడంలో , సేవా కార్యక్రమాలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకుడు అకస్మాత్తుగా పార్టీని వీడటం స్థానికంగా చర్చకు దారి తీసింది. సూర్యనారాయణ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం వెనుక అసంతృప్తి కారణమా లేదా బీజేపీ విధానాల పట్ల ఆకర్షణ అన్న అంశంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తగిన గుర్తింపు లభించలేదనే భావనతో పాటు, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న అభివృద్ధి తనను ఆకర్షించిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన బీజేపీలో చేరిక కనిగిరి నియోజకవర్గ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో మరి కొందరు నేతలు కూడా పార్టీల మార్పు దిశగా అడుగులు వేయవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

## హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**కనిగిరి, మార్చి 8, ప్రభాతవార్త**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు విమర్శించారు. శనివారం రాత్రి పీసీపల్లి మండలంలోని పెద్ద ఇర్లపాడు గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, ఫీజు రియింబర్స్ మెంట్, రూ.20లక్షల ఉద్యోగాల కల్పన వంటి కీలక హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి, నగదు సబ్సిడీని సక్రమంగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. అలాగే వృద్ధులు, వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూడా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పోలు జయరామిరెడ్డి, ముప్పూరి శ్రీనివాసులు, మడతల ఓబుల్‌రెడ్డి, వైసీపీ ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు లింగాలదిన్నె నరసింహారెడ్డి, ఆంద్రా వెంకటేశ్వర్లు, లింగాలదిన్నె మహేందర్‌రెడ్డి, గోపిరెడ్డి రోశిరెడ్డి, బోగాల జయరాం, మాల్యాద్రిరెడ్డి, బోగాల మనోజ్, లెక్కల చలమారెడ్డి, పెద్దిరెడ్డి ఓబుల్‌రెడ్డి కొండారెడ్డి, మందా మహేందర్‌రెడ్డి, సాయి కుమార్, నరేష్ సాంబయ్య, ప్రకాశం జిల్లా వైసీపీ మహిళా ఉపాధ్యక్షురాలు పోలు వరలక్ష్మీ, ఎరుకలరెడ్డి, ఉండేలా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి



**కనిగిరి, మార్చి 8, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలంలోని పెద్ద ఇర్లపాడు గ్రామానికి చెందిన కరణం గంగయ్య కుమారుడు వివాహం శనివారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

### వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై.. బీజేపీలో చేరిన చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి



**కనిగిరి, మార్చి 8, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లో చేరారు. హైదరాబాద్‌లో బీజేపీ నేషనల్ జనరల్ సెక్రటరీ బీఎల్ సంతోష్ సమక్షంలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత పాతిక సంవత్సరాలుగా వైఎస్ కుటుంబంతో పాటు వైఎస్ అభిమానిగా రాజకీయ ప్రయాణం కొనసాగించానన్నారు. గత పది సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీ ఎన్నారై ప్లాట్‌ఫాం ద్వారా వివిధ హోదాల్లో పని చేస్తూ పార్టీ కోసం ఆస్ట్రేలియాతో పాటు భారతదేశ తన వంతు కృషి చేశానని తెలియజేశారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరినట్లు వెల్లడించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం తనను ఎంతో ఆకర్షించిందని ఆయన పేర్కొన్నారు. మోడీ, అమిత్‌షా, బీఎల్ సంతోష్ వంటి నాయకులు మార్గదర్శకత్వంలో బీజేపీ దేశ అభివృద్ధికి కృషి చేస్తోందని, ఆ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఇకపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు సూచనల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఎన్నారై ప్లాట్‌ఫాం ద్వారా భారతదేశంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కూడా బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేస్తానని వెల్లడించారు. ఇప్పటి వరకు తన రాజకీయ ప్రయాణంలో దశాబ్దాల కాలంలో తనకు సహకరించిన కార్యకర్తలు, నాయకులకు సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ సహకారం అందించాలని కోరారు.

# మహిళా సంక్షేమంలో ఏపీ నెం.1

### - మహిళలకు పెద్దన్న సీఎం చంద్రబాబు - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ






**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
మహిళా సాధికారితకు పునాది వేసింది ఎన్టీఆర్. మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసిన సీఎం చంద్రబాబు. డ్వాక్రా మహిళలకు రూ.5లక్షల రుణ పరిమితి. తల్లికి వందనంతో 67లక్షల తల్లులకు రూ.10వేల కోట్లు. ఉచిత బస్సు ప్రయాణంలో 45 కోట్ల మహిళలకు లబ్ది రూ.3 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ.5 వేల మినీ అంగన్‌వాడీలు ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్, మహిళల కోసం 3 లక్షల ఇళ్ల ఉగాదికి మరో లక్ష గృహ ప్రవేశాలు. లక్ష కుట్టు మిషన్ల పంపిణీకి శిక్షణ కార్యక్రమం. మహిళలను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళల గొప్పతనాన్ని కొనియాడారు. ఆమె మాట్లాడుతూ స్త్రీ లేకుండా సృష్టి లేదు, జీవనం లేదు, ప్రపంచాన్ని ఊహించలేమని లక్ష్మీ తెలిపారు. మహిళలను కుటుంబ పరిమితుల్లో మాత్రమే కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చూడాలనే దూరదృష్టి గల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని డాక్టర్ లక్ష్మీ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లోనే మహిళా సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచిందన్నారు. డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం రుణ పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల తల్లులకు రూ.10 వేల కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఎన్నికల హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయడంతో ఇప్పటికే రూ.45కోట్ల మంది మహిళలు లబ్ది పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సొసైటీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శాంసన్, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సీడీపీవో పరిమళ, దర్శి మున్సిపల్ ఇన్‌చార్జి కమీషనర్ శ్రీరామమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, మహిళా నాయకురాలు కౌన్సిలర్ నారపుశెట్టి ధనలక్ష్మీ, రాష్ట్ర టీడీపీ మహిళా సభ్యురాలు శోభారాణి, జనసేన దర్శి మండల పుప్పాల ధనలక్ష్మీ, నాగమణి, అనూష, విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ, పోకూరి ధనలక్ష్మీ, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, ఏపీఎంలు, డ్వాక్రా గ్రూపుల సీసీలు, నియోజకవర్గంలోని మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### తిరుణాలలో అన్నదానాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
దర్శి పంచాయతీలోని చింతలపాలెం గ్రామం నందు శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరుణాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, యాదగిరి వాసు, కనకం శ్రీనివాసరావు, కట్టుకోట హరీష్, జూపల్లి కోటేశ్వరరావు, నక్క రంగా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఈద్గా ముస్లిం సొసైటీకి రూ.5 లక్షలు సహాయం అందజేసిన దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
అధికారం ఉన్నా లేకపోయినా మాట ఇచ్చారు అంటే ఇచ్చిన మాట అమలు కావాల్సిందే. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులోని ఈద్గాలో ముస్లిం సొసైటీ కోసం రూ.5లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి ఆదివారం ముస్లిం సోదర్లకు రూ.5లక్షలు అందజేసిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం సోదరులకు రూ.5లక్షలను బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నాన్న బూచేపల్లి సుబ్బారెడ్డి వారసత్వంగా దేవాలయాలకి చర్చిలకి మసీదులకు ఎప్పటి నుండో మా వంతు సహాయం అందజేస్తున్నామని, అందులో భాగంగానే ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం సోదరులకు ఐదు లక్షల రూపాయలని అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. ముస్లిం సోదరులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### చిలకలూరిపేట పట్టణంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
శనివారం రాత్రి ఓయాసిస్ సమస్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే కందిమల్ల జయమ్మ నేతృత్వంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో చిలకలూరిపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావుతో కలిసి పాల్గొన్న దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు రాణి రుద్రమదేవి తదితరులు ఉన్నారు.

## ఆకట్టుకున్న కోలాట నృత్య ప్రదర్శన



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
దర్శి మండలం వెంకటాచలం క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర పద్మావతి స్వామి వారి వార్షిక తిరుణాళ్ల సందర్భంగా చలివేంద్ర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాట నృత్యం అందరిని అలరింపచేసింది. పాల్గొన్న చిన్నారులను హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బందిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

## ఎస్‌వీఆర్ స్కూల్ ఫేర్వెల్‌డే వేడుకలు




**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
దర్శిలోని ఎస్‌వీఆర్ స్కూల్ పదో తరగతి విద్యార్థుల ఫెర్వెల్ డే వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖ అధికారి మాలకొండయ్య బాలికల హైస్కూల్ హెచ్‌ఎం ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, శేషంవారిపాలెం హెచ్‌ఎం నాగేశ్వరరావు, పాఠశాల డైరక్టర్ చింత సునీత, చింత తిరుపతిరెడ్డి, మీనాక్షి హాస్పిటల్ డాక్టర్ ప్రసన్న, ఉపాధ్యాయ సంఘం నాయకులు విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేవీకే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**దర్శి, మార్చి 8, ప్రభాతవార్త**
దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేవీకే హెడ్ డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ దేశ పురోగతిలో భాగస్వాములు అవుతున్నారని కొనియాడారు. అదే విధంగా కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని అన్నారు. అనంతరం కేవీకేలో పని చేస్తున్న మహిళా మూర్తులను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది ఉన్నారు.

### తాడేపల్లిలో జరిగిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మేడికొండ జయంతి



**ముండ్లమూరు, మార్చి 8, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తాడేపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముండ్లమూరు మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పలు జిల్లాలలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ మహిళలు మహోన్నతమైన శక్తి అని ప్రతి రంగంలో మహిళలు ప్రస్తుత సమాజంలో ముందుంటున్నారని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆమెపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విభాగం మహిళ నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు





**అద్దంకి , మార్చి 8,ప్రభాతవార్త**
సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవంలో 5 దంపతులు పాల్గొన్నారు పాల్గొన్న దంపతులకు శేషవస్త్రములు,ప్రసాదములు,భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాణాధికారి మద్దినేని శ్రీనివాస్ రావు, గుంజి శ్రీనివాస్‌రావు, చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

### కొరిసపాడు ఎత్తిపోతల పథక అడ్డంకులను సత్వరమే పరిష్కరిస్తాం

#### - మూడు నెలలోనే నిర్మాణ పనులు పూర్తి - 10వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం

#### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





**కొరిసపాడు,మార్చి 8,ప్రభాతవార్త**
కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు రిజర్వాయర్ పెండింగ్ పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టర్ అధికారులతో కలసి రిజర్వాయర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయరుకు తరలించేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇటీవల ఈ రిజర్వాయర్ గురించి ముఖ్యమంత్రి వద్ద జరిగిన సమావేశంలో ఈ ప్రస్తావన వచ్చిందన్నారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడ రిజర్వాయర్ పనులను పూర్తిచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎత్తిపోతల పైప్ లైన్లు పనులు పూర్తిఅయ్యాయిన్నారు. నిర్వాసితులకు నష్ట పరిహారంతోపాటు రిజర్వాయర్ వద్ద కట్ట నిర్మాణ పనులు, కొంత అసంపూర్తిగా వున్నాయన్నారు. మొదటి విడత ప్రభుత్వం 35కోట్లను బడ్జెట్‌లో కేటాయించిదన్నారు.నష్ట పరిహారం, పెండింగ్‌లోవున్న పనులను మూడు నెలలో పూర్తిచేసి, రిజర్వాయర్ క్రింద వున్న సుమారు 10వేల ఎకరాలు ఆయకుట్టకు సాగునీరు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రాజెక్ట్స్ ఎస్.ఈ. అబూత్ అలీం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, ఎంపీడీవో ఆర్. రాజ్యలక్ష్మి, తహసిల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ విజయకుమార్, మండల టిడిపిఅధ్యక్షుడు చింబోతుల సత్యనారాయణలతోపాటు పలువురుఅధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



**అద్దంకి ,మార్చి 8,ప్రభాతవార్త**
అద్దంకి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కమిటీ చైర్మన్ పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా దేవస్థానంలో మాతా గోవింద మాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అద్దంకి కాకానిపాలెం రంగనాయక స్వామి కోలాట భజనమహిళా మండలి బృందం వారిచే గత 20 సంవత్సరం నుండి అనేక సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిటీ ఆర్గనైజర్స్ నరిశెట్టి లీలాకుమారి, పాములపాటి నారాయణ, వైకుంఠ వాణి, గోరంట్ల పుల్లారావు, దూళిపాళ్ల రత్తమ్మ, 30 మంది మహిళలను అద్దంకి ఎఎస్ఎన్ కేబుల్ మేనేజింగ్ నూతన డైరెక్టర్ ఒలేటి గౌరీ శంకర్ ఉమాదేవిలు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియపరచి సృష్టికి మూలం మహిళ ఏ కుటుంబ అభివృద్ధి చెందా లన్న మహిళకీలకపాత్ర అని మహిళలు రాజ్యాధికారంలో భాగస్వాములు అవుతారని బ్రహ్మంగారి ఆనాడే కాలజ్ఞానంలో చెప్పియున్నారు నేటి పరిస్థిలో ప్రధానమంత్రి రాష్ట్రపతి అయిన విషయాలు మనం చూస్తూనే ఉన్నాము. మహిళలకు రాజ్యాధికారంలో 50 రిజర్వేషన్ కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ ధర్మకర్త అనంత వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఏలూరు వీర బ్రహ్మచారి, మిద్దె బోయన ఆంజనేయరాజు, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఒలేటి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## అద్దంకి మహిళా కండక్టర్లకు అరుదైన గౌరవం






**అద్దంకి ,మార్చి 8,ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభవేళ అద్దంకి ప్రజా రవాణా మహిళా కండక్టర్లకు అరుదైన పురస్కారం దక్కింది. ఆదివారం ఒంగోలులో ఏర్పాటుచేసిన ప్రయాణికులకు విశేష సేవలు అందించిన మహిళా మణులకు శాలువాలు కప్పి, ప్రశంస పత్రాలు అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కండక్టర్ లే బూరి ఉమామహేశ్వరి మాట్లాడుతూ అమానవీయమైన అణచివేతను, తీవ్ర వివక్షతను ఎదుర్కొన్న మహిళా కార్మికులు, రక్తం ధార పోసి హక్కుల సాధన కోసం తెగించి పోరాడిన ఫలితంగా 1977లో మహిళా దినోత్సవం ఆవిర్భవించింది అన్నారు. ఈ పోరాటం ఫలితంగానే ఎనిమిది గంటల పని దినాన్ని, వేతన పెంపుదలను, మరికొన్ని హక్కులను సాధించుకోగలిగామని గుర్తు చేశారు.మహిళా కార్మికుల నిరసన మూలాల నుండి ప్రపంచ వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించటం శుభపరిణామం.లింగ సమానత్వం, సాధికారత, సామాజిక న్యాయం కోసం నాటి నుండి నేటి వరకు మహిళలు పోరాడుతూనేఉన్నారన్నారు.పురుషులతో సమానంగా మహిళలు సమాజంలో పాల్గొనటానికి శతాబ్దాలుగా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి, అని వారి పోరాటాల గుర్తింపు కారణంగానేతెలుగింటి ఆడపడుచుల కోసం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆడపడుచులకు ఆస్తిలో సమాన హక్కు కల్పించగా,అమరావతి సృష్టికర్త చంద్రబాబునాయుడు, ఆడబిడ్డలను మహిళా కండక్టర్లుగా తీర్చిదిద్దారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15,2025 నుండి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శ్రీ శక్తి పథకం విజయవంతంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్న, అలుపెరగక శ్రమిస్తున్న ఘనత మహిళా కండక్టర్ల శ్రమకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేల ప్రత్యేక గుర్తింపురావడం శుభ పరిణామం అన్నారు.2.6 కోట్ల మంది మహిళలు నిత్యం స్త్రీ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న వారికి అన్నీ తామై మహిళ కండక్టర్లు చేయూతనందిస్తున్నారని తమ శ్రమను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.ఎం సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ మహబూబి, పలువురు మహిళా అధికారులు, కండక్టర్లు కోటేశ్వరమ్మ, రాజేశ్వరి ,సత్యవాణి, శారద, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నగర్ వద్ద ఆటో బోల్తా - ఒకరికి గాయాలు





**అద్దంకి , మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని శ్రీనగర్ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడిన ప్రమాద సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. రెండు కాళ్ళు, తొడ భాగాలలో కాళ్ళు విరిగినట్లు సమాచారం. 108 సిబ్బంది క్షత గాత్రుని ఒంగోలులోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

## గోపాలపురం వద్ద కంటైనర్ బోల్తా - ఒకరికి గాయాలు






**అద్దంకి, మార్చి 8, ప్రభాతవార్త**
మండలంలోని గోపాలపురం సమీపంలో కంటైనర్ వాహనం బోల్తాపడిన సంఘటన ఆదివారం చోటుకుంది. ఫర్నిచర్ లోడుతో చెన్నైయినుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఈ కంటైనర్ ప్రమాద వశాత్తు గోపాలపురం సమీపంలో పడిపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్ రాజాకు స్వల్పగాయాలు అయ్యాయి.

